క్లుప్తంగా

గ్రామాలలో బడి బాట



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీలత, సిబ్బందితో కలిసి శుక్రవారం మద్దెల చెరువు, గౌరారం గ్రామాలలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ కి దీటుగా విద్య బోధన ఉంటుందన్నారు. సిబ్బంది బుజ్జయ్య, మణి, సీఆర్పీ గోపాల్ ఠాకూర్ పాల్గొన్నారు.

పోచారంపై అనుచిత వ్యాఖ్యలు సరి కాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని నస్రుల్లాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం అంకోల్ క్యాంపులో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు మాట్లాడారు. మరోసారి పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. బాన్సువాడలో అడుగుపెట్టనీయమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్యామల, మాజీ ఏఎంసీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, మాజీ కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, నాయకులు వెంకట రమణ, కంది మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన డీఈ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలోని కాలనీలో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో డీఈ విజయసారథి ప్రారంభించారు. కాలనీ వాసులు గత కొంత కాలంగా లో ఓల్టేజీ తో ఇబ్బందులు పడుతున్నామని ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో స్పందించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగింపజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డీఈ, ఏడీఈలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఏడీఈ మల్లేశ్, ఏఈ సాయినాథ్, ఎల్ఎం వాహిద్, ఆదిరెడ్డి, రవిగౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భిక్కనూరు: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భిక్కనూరు మండలం నుంచి భారీసంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్ కోరారు. ఈసందర్భంగా వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో నాయ కులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు దేవర లక్ష్మి, అందే మహేందర్‌రెడ్డి, వంగేటి చిన్న నర్స రెడ్డి,,నాగార్తి భూంరెడ్డి, తుక్కి వేణు, రాంచంద్రం, రవీందర్‌రెడ్డి, సాయిరెడ్డి, సాయగౌడ్,కర్నాల మల్లేషం, యాదగిరి తదితరులున్నారు.

బీసీ రాజ్యాధికార సమితి బలోపేతానికి కమిటీలు వేస్తాం

కామారెడ్డి అర్బన్: దేశంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చెబుతున్న సామాజిక న్యాయానికి, తెలంగాణలో అమలవుతున్న ప్రభుత్వ విధానాలకు పొంతన లేకుండా ఉందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాస్ సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గండి వీరేందర్‌గౌడ్‌లు ఆరోపించారు. గురువారం రాత్రి పట్టణ పరిధిలోని దేవునిపల్లి మున్నూరుకాపు సంఘంలో బీసీ రాజ్యాధికార సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీ రాజ్యాధికార సమితిని బలోపేతం చేయడానికి ప్రతి మండలానికి 21 మందితో కమిటీలు వేసి శిక్షణ నిర్వహించాలని తీర్మానించారు. నాయకులు కాముని సుదర్శన్, చింతల శంకర్, రాజేందర్, అశోక్‌రాజ్, శ్రీనివాస్‌యాదవ్, అంబాదాస్, నవీన్, హరినాథ్ ఆర్య, మంజుల, లక్ష్మి తదితరులున్నారు.



ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బాన్సువాడ సీఎస్ఐ చర్చిలో..

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

తాడ్వాయి/కామారెడ్డి టౌన్/ఎల్లారెడ్డిరూరల్/ఎల్లారెడ్డి/బాన్సువాడ/నిజాంసాగర్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవులు స్థానిక ప్రార్థన మందిరాలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా చర్చిల ఫాదర్‌లు దైవ సందేశాన్ని ఇచ్చారు. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఎల్లారెడ్డి ఏదవర్షిప్ చర్చిలో అన్నదానం చేశారు. బాన్సువాడలో శనివారం జరిగే రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎస్ఐ చర్చి ఫాదర్ ఏసుదాస్ తెలిపారు.



కామారెడ్డి సీఎస్ఐ చర్చిలో బైబిల్ చదువుతున్న క్రైస్తవులు



తాడ్వాయి చర్చిలో..



ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో దైవ సందేశమిస్తున్న ఫాదర్



బైబిల్ చదువుతున్న యువతి



మహమ్మద్ నగర్ చర్చిలో ..

ఆసక్తిని పెంచి.. నైపుణ్యం వెలికితీసేలా

- కస్తూర్బా పాఠశాలల్లో ఈ నెల 23వరకు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమాలు
- కార్యాచరణ రూపొందించిన విద్యాశాఖ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కస్తూర్బా పాఠశాలల విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంచి.. నైపుణ్యం వెలికితీసేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. కస్తూర్బా పాఠశాలల్లో ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో 6 నుంచి 9 తరగతి విద్యార్థులు భాగస్వామ్యులు కానున్నారు. తొలిరోజు విద్యార్థులకు వారంరోజుల పాటు చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రెండో రోజు విద్యార్థులకు ఇష్టమైన కథలను తెలుగు లేదా, ఇంగ్లీష్ లేదా హిందీ భాషల్లో రాయించడం, చదివించడం చేశారు. మూడోరోజు స్పోకెన్ ఇంగ్లీష్, పబ్లిక స్పీకింగ్ పేరిట విద్యార్థులు వారిని వారు పరిచయం చేసుకోవడంతో పాటు వారి తల్లిదండ్రులను పరిచయం చేస్తూ ఇంగ్లీష్‌లో మాట్లాడించడం చేయిస్తారు. నాలుగోరోజు డ్రీమ్ కార్నర్ పేరిట విద్యార్థులు భవిష్యత్తులో వారు సాధించాలనుకుంటున్న ఆశయాల గురించి వివరించనున్నారు. ఐదోరోజు ఇదివరకు కస్తూర్బా పాఠశాలల్లో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరిన వారి విజయగాథలు, ఆత్మగౌరవ కార్యక్రమాల గురించి కస్తూరి విజయం పేరిట వివరించనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు తెలుగు, ఇంగ్లీష భాషల్లో ప్రత్యేక పుస్తకాలను రూపొందించి పాఠశాలలకు సరఫరా చేశారు. ఆరో రోజు లైఫ్ స్కిల్స్ పేరిట జీవిత నైపుణ్యాలపై, సురక్షితమైన, బాధ్యాతయుతమైన ప్రవర్తన, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. చివరిరోజు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకోసం కార్యచరణను తయారు చేసుకొని పాఠశాలల్లో సిబ్బందికి విధులు అప్పగించారు.



ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలు

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిరూరల్: కొనుగోలు కేంద్రాలలో వసతులు కరువు అనే శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎల్లారెడ్డి సొసైటీ సిబ్బంది స్పందించారు. ఎల్లారెడ్డి క్లస్టర్ అధికారి నర్సింలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, పందిరి వేయించి సౌకర్యాలను కల్పించారు. రైతులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.



గండిమాసానిపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాగునీటి వసతిని కల్పించిన సొసైటీ సిబ్బంది

రైతుల సౌకర్యార్థం ప్యాడీ క్లీనర్

బాన్సువాడ : రైతుల సౌకరార్థం ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్ యంత్రాన్ని కొనుగోలు చేసినట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ. 2 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్ యంత్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మిషన్ గంటకు 60–70 క్వింటాళ్ల ధాన్యాన్ని శుభ్రపరుస్తుందన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం బాన్సువాడ, బీర్కూర్, ఎల్లారెడ్డి, భిక్కనూర్ మార్కెట్ కమిటీలకు ఈ యంత్రాలను అందజేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంవో రమ్య, నాయకులు మంత్రి గణేష్, కార్యదర్శి నరేందర్, డైరెక్టర్ నందు, రఫీక్, భగవాన్ తదితరులున్నారు.



బాన్సువాడలో ప్యాడీ క్లీనర్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ

వైభవంగా బారడి పోచమ్మ పండుగ



మద్నూర్‌లోని బారడిపోచమ్మ ఆలయం చుట్టూ తిరుగుతున్న ట్రాక్టర్లు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి వద్ద గల బారడి పోచమ్మ పండుగను శుక్రవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలు మండల కేంద్రంలో బోనాలతో ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి ఆలయం వద్ద భోజనాలు చేశారు. గతంలో ఆలయం చుట్టూ రైతులు ఎడ్ల బండ్లతో ఊరేగింపుగా ప్రదర్శన నిర్వహించేవారు. ఈసారి ట్రాక్టర్లతో రైతులు నిర్వహించిన ఊరేగింపు ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఆవరణలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజాగౌడ్, సిద్దిరాంరెడ్డి, బాపురావు, శ్రీను, గంగారాం. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులోని కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆర్చకుడు దత్తాద్రిశర్మ, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చన నిర్వహించారు.

ఆధ్యాత్మికం



సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణం



పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న ఇలియాస్

దోమకొండ: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మహమ్మద్ ఇలియాస్ కల్యాణంలో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్తడి పోచమ్మ జాతర

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో శుక్రవారం మత్తడి పోచమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రైతులు ఎడ్లబండ్లను అందంగా అలంకరించి గ్రామశివారులోని మత్తడి పోచమ్మ గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయించారు. కులసంఘాల ఆధ్వర్యంలో గుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఓంకారేశ్వర ఆలయంలో పూజలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో గల ఓంకారేశ్వర ఆలయంలో శుక్రవారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన పంచలు, చీరలకు ఆలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అవినాష్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కపిల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఎమ్మెల్యే సొంత నిధులతో పోచమ్మ ఆలయానికి శ్లాబ్

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి మాల సంఘం మాలపోచమ్మ ఆలయానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి సొంత నిధులతో నాయకులు శుక్రవారం శ్లాబ్ పోశారు. ఈసందర్భంగా బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో ఎమ్మెల్యే స్లాబ్ వేయించాడన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు పాల్గొన్నారు.

పుష్కరిణి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఆలయ చైర్మన్

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద శుక్రవారం పుష్కరిణి నిర్మాణానికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరిణి నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేయాలని కోరారు. అనంతరం స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శ్రీధర్ రావు,డైరెక్టర్లు,అర్చకులు, గ్రామస్తులు ఉన్నారు.

త్వరలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: రెండు, మూడు నెలల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక డెయిరీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు ఎ.కుషాల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథులుగా శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పి.దామోదర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతు అంతర్ జిల్లా బదిలీలు, ప్రమోషన్లు, హెల్త్‌కార్డులు, పీఆర్‌సీతో పాటు ఐదు వేల ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ల పోస్టులు త్వరలో మంజూరు అవుతాయన్నారు. పీఆర్టీయూ ప్రాథమిక సభ్యులందరు క్రమశిక్షణతో సంఘ నిర్మాణానికి కృషి చేయాలన్నారు.ఈసందర్భంగా అతిథులను వీరు ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం





వెల్గనూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి, హన్మాజీపేట్‌లో ..

నిజాంసాగర్/బాన్సువా రూరల్ : జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం వెల్గనూర్ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ జొన్నలకు రూ.3,371 మద్దతు ధర ప్రకటించిందన్నారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో బోర్లం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, ఆనంద్‌కుమార్, గైని. జగన్, మానిటరింగ్ ఆఫీసర్ కరుణాకర్, సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ నాయకుల ధర్నా



ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి: పట్టణంలోని గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ సోనియా, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ తదితరులున్నారు.

వక్ఫ్‌చట్ట సవరణకు వ్యతిరేకంగా నిరసన

బాన్సువాడ రూరల్: కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌చట్ట సవరణకు వ్యతిరేకంగా తన్‌జీముల్ మసీద్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బాన్సువాడలో అన్ని మసీద్‌ల వద్ద ముస్లింలు నిరసన తెలిపారు. వక్ఫ్ చట్టసవరణను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సామూహిక ప్రార్థనల అనంతరం నల్లరిబ్బన్లు, నల్లజెండాలతో శాంతియుత నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. వక్ఫ్ చట్టసరవణను రద్దు చేసేవరకు దశలవారి పోరాటం చేస్తామన్నారు. వచ్చే శుక్రవారం మధ్యాహ్నం బాన్సువాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఈకార్యక్రమంలో వివిధ మసీద్ కమిటీ బాధ్యులు, మైనారిటీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



బాన్సువాడ జామే మసీద్ వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల స్థలం పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటామని దరఖాస్తులు పెట్టుకున్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని బిచ్కుంద జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 840 ఇళ్లు మంజూరు కావడంతో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి వారి స్థలం ఇతర వివరాలు పరిశీలిస్తున్నామని సూచించారు.

'రాజీవ్ యువవికాసం' దరఖాస్తుకు నేడు ఆఖరు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి శనివారం ఆఖరు తేదీ అని ఎంపీడీవో సయ్యద్ సాజిద్‌అలీ తెలిపారు. ఈనెల14వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

బాన్సువాడ రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని బాన్సువాడ నియోజకవర్గ తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఉడుత గంగాధర్, చందు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టనున్నామన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

సరంపల్లిలో బోరు మోటర్ ప్రారంభం

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ లోని ఆరో వార్డు సరంపల్లి గ్రామంలోని ఆకుల వారి గల్లీలో నూతన సింగల్ ఫేజ్ మోటర్‌ను శుక్రవారం మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ బిగింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సహకారంతో కొత్త మోటర్‌ను బిగించామన్నారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ప్రాచీన శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల కృష్ణామాచారి (80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కృష్ణామాచారి మృతికి పలువురు భక్తులు, అర్చకులు సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ధ్యానంతో ఆరోగ్యం భద్రం



బీబీపేటలో మాట్లాడుతున్న భూపతి రాజు

బీబీపేట: ప్రతి రోజు ధ్యానం చేయడంతో ఆరోగ్యం భద్రంగా ఉంటుందని సిద్దిపేట ధ్యాన కేంద్ర నిర్వాహకులు భూపతి రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వాసవి క్లబ్‌లో ధ్యానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్రీజీ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని సభ్యులకు నిత్యం ధ్యానం చేయడం వల్ల కలిగే లాభాలను, అలాగే ఆరోగ్య సూత్రాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నిర్వాహకులు భూమిరెడ్డి, బీబీపేట ధ్యాన కేంద్ర నిర్వాహకులు గాడి లింగం, దేవునిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.